క్లుప్తంగా

వేంకటేశ్వరునికి జన్మనక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్ర పూజలు చేశారు. ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఆలయ అర్చక బృందం సభ్యులు స్వామికి పంచామృతాభిషేకం పూజలు చేశారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

కపిలేశ్వరపురం: స్థానికంగా శుక్రవారం వైఎస్సార్ సీపీ గ్రామ స్థాయి, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించనున్నట్లు గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కట్టా మురళి, పీతల గ్రావిడ్ మార్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు హాజరవుతారని తెలిపారు.

రేపటి నుంచి వార్షిక పరీక్షలు

మండపేట: జిల్లాలో ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు వార్షిక పరీక్షలు ఈ నెల ఆరో తేదీ నుంచి నిర్వహిస్తున్నట్టు మండల విద్యాశాఖ అధికారి నాయుడు రామచంద్రరావు తెలిపారు. ఈ పరీక్షలు 19వ తేదీ వరకూ జరగనున్నాయి. విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12.15 గంటలకు వరకు ఆయా పాఠశాలల్లో పరీక్షలు జరుగుతాయన్నారు.

ప్రథమాభిషేకం అద్భుతం



రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ప్రథమాభిషేక సేవ చాలా అద్భుతంగా ఉంది న్యూజెర్సీ నుంచి గురువారం ఆలయానికి విచ్చేసిన మహిళ మైథిలి ప్రశంసించారు. కేవలం రూ.500 టికెట్తో స్వామివారికి ప్రథమాభిషేకం చేయడంతో పాటు, అమ్మవారికి కుంకుమార్చన, వేద పండితులతో వేదాశీర్వచనం మంచి అనుభూతి కలిగించిందని తన ఆనందాన్ని పంచుకున్నారు. ఆలయం కూడా చాలా ప్రశాంతవాతావరణంలో ఉందన్నారు.

భీమేశ్వరాలయంలో మైథిలి

అవయవదానం చేసిన మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శ



అవయవ దాత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీసీ నాయకుడు కోన

మండపేట: పట్టణంలో కొద్దిరోజుల క్రితం ప్రమాదంలో తలకు గాయమైన మృతి చెందిన మారేడుబాక గ్రామానికి చెందిన రాజు కుటుంబ సభ్యులను జిల్లా బీసీ సంఘం క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కోన సత్యనారాయణ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బౌతికంగా దూరమైనప్పటికీ ఆయన అవయవాల ద్వారా ముగ్గురిలో జీవిస్తున్నారని ఆయన అన్నారు. ప్రగాఢసానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు పెంకే గంగాధర్, బీసీ వెంకట్రావు తదితరులు ఉన్నారు.

బాబూ జగ్జీవన్ రామ్కు చిత్ర నివాళి



బాబూ జగ్జీవన్రామ్ చిత్రం



సొదాగర్

రాయవరం: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని పలువురు పలు రకాలుగా నివాళులు అర్పిస్తారు. రాయవరం గ్రామానికి చెందిన ఇండిగమిల్లి సొదాగర్ జగ్జీవన్ రామ్ చిత్రాన్ని వాటర్ పెయింట్స్తో వేసి నివాళులర్పించారు. ఈ చిత్రం పలువురిని విశేషంగా ఆకట్టుకుంది.

గౌరవ వేతనం చెల్లించాలి

మండపేట: ఇస్నాని చెల్లెన ఐమాస్, మౌజన్ గౌరవవేతనాన్ని ప్రభుత్వం చెల్లించాలని ముస్లిం పెద్దలు కోరారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ముస్లిం నాయకులు అబ్దుల్ రజాక్ (బదా), హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వరించింది

- గ్రామాల్లో వరి కోతలు ప్రారంభం
- ఎకరాకు 50 నుంచి 55 బస్తాల దిగుబడికి అవకాశం
- అనుకూలించిన వాతావరణం
- రబీపై అన్నదాతల ఆశలు

రాయవరం: ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా వెన్ను చూపక ఏరువాక సాగించిన అన్నదాత కష్టం ఫలించనుంది. చెమట చుక్క చిందించి నేలను తడిపిన శ్రమకు తగ్గ ఫలితం దక్కే రోజు వచ్చేసింది. సాగు నీటి కష్టాలను కూడా గట్టెక్కించిన రైతన్నలు స్వేద సేద్యం చేసి పంట లక్ష్మిని ఇంటికి తెచ్చే ప్రయత్నంలో ఉన్నారు. ముందుగా వరినాట్లు వేసిన రైతులు వరికోతలు ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడం, తెగుళ్లు ఆశించకపోవడంతో రబీ దిగుబడులపై అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు.

అనుకూలించిన వాతావరణం

రబీ ప్రారంభం నుంచి అన్నదాతకు వాతావరణం అనుకూలించిందనే చెప్పవచ్చు. సాధారణంగా రబీ చివర్లో దోమపోటు, వివిధ రకాల తెగుళ్ల వరి పంటను ఆశించాయి. రబీ ప్రారంభం నుంచి తెగుళ్లు, పురుగుల ఉధృతి తక్కువగా ఉండడంతో రైతన్నలకు పురుగుమందులపై పెట్టే పెట్టుబడి గణనీయంగా తగ్గింది. దిగుబడి గతేడాదిని మించి ఉంటాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎకరాకు సరాసరి సుమారు 50–55 బస్తాల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు భావిస్తున్నారు. గత ఖరీఫ్లో దిగుబడి ఆశాజనకంగానే ఉన్నప్పటికీ, ఖరీఫ్ దిగుబడులను మించి, రబీ దిగుబడులు ఉంటాయని రైతన్నలు ఆశలు పెట్టుకున్నారు. వారి ఆశలకు అనుగుణంగా వాతావరణం, ప్రకృతి సహకరించడంతో అన్నదాతల ఆశలు మోసులెత్తుతున్నాయి.

ప్రారంభమైన వరికోతలు

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో 99,583 ఎకరాల్లో రబీ వరి సాగు చేపట్టారు. రాయవరం మండలంలో 14,509, మండపేటలో 16,296, కపిలేశ్వరపురంలో 15,758, రామచంద్రపురంలో 18,120, కె.గంగవరంలో 15,444, కాజులూరు మండలంలో 19,456 ఎకరాల్లో రబీ వరిసాగు చేస్తున్నారు. క్లస్టర్ పరిధిలో సుమారుగా 90 శాతం మేర ఎంటీయూ 3626(బొండాలు) రకాన్ని సాగు చేయగా, మిగిలిన 10 శాతం 1121(శ్రీధృతి) రకాన్ని, ఆర్ఎన్ఆర్ 34449 తదితర రకాలను సాగు చేశారు. ఇప్పటికే పంట పక్వానికి రావడంతో వరి కోతలకు సిద్ధంగా ఉంది. వరి కోత యంత్రాలతో కోతలు ప్రారంభించారు.



రాయవరంలో వరికోత యంత్రంతో చేపడుతున్న కోతలు



దోమపోటు లేదు



గతంలో పోలిస్తే ప్రస్తుత రబీలో దోమపోటు ప్రభావం లేదనే చెప్పాలి. దిగుబడులపై ఆశలు పెట్టుకున్నాం. ఖరీఫ్ మాదిరిగానే రబీ రైతులను గట్టెక్కిస్తుందని ఆశిస్తున్నాం. ఆరు ఎకరాలు కౌలు వ్యవసాయం చేస్తున్నాను.

– కొవ్వూరి వెంకటరెడ్డి, కౌలు రైతు, పసలపూడి

దిగుబడి బాగుంది



ఈ ఏడాది కనీస దిగుబడులకు ఢోకా ఉండదు. రబీల్లో తెగుళ్లు అంతగా ఆశించలేదు. తెగుళ్లు, పురుగులు పంటను అంతగా ఆశించకపోవడంతో పెట్టుబడి ఖర్చు తక్కువగానే అయింది. ఎకరాకు 55 బస్తాల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నా. పక్వానికి వచ్చిన పొలాల్లో వరి కోతలు రైతులు ప్రారంభించారు. ఉగాది తర్వాత వరికోతలు ఊపందుకుంటాయి.

– కొమ్మిశెట్టి ప్రభాకర్, మండలం

7న నియోజకవర్గ బీసీల సమావేశం



బీసీ సదస్సు వివరాలను వెల్లడిస్తున్న తోట త్రిమూర్తులు

మండపేట: నియోజకవర్గం బీసీల సమావేశం ఈనెల 7వ తేదీన ద్వారపూడి రోడ్డులోని శ్రీ హైస్కూల్ ఎదురుగా అనంతలక్ష్మి లేఅవుట్లో బీసీ సదస్సు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వెల్లడించారు. స్థానిక విజయనగర్లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ జాతీయ బీసీ సంక్షేమ ఫ్రంట్ ప్రెసిడెంట్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు, శెట్టిబలిజ మహానాడు కన్వీనర్, కాసనమండలి సభ్యుడు కుడుపూడి సూర్యనారాయణరావు పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో బీసీలు ఈ సమావేశంలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తోట త్రిమూర్తులు కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్, శెట్టిబలిజ సంఘం పట్టణ అధ్యక్షుడు వంపన శ్రీనివాస్, మట్టపలు గణపతి, యాండ్ర ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

85 శాతం పింఛన్ల పంపిణీ

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో పింఛన్ల పంపిణీ వేగంగా సాగుతోంది. ఈ నెలకు సంబంధించి 9,848 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా గురువారం నాటికి 8,287 మందికి పంపిణీ చేయడంతో 85 శాతం నమోదైంది. మిగిలిన 3,138 మందికి అందించేందుకు సిబ్బంది సన్నద్ధమైనట్టు ఎంపీడీఓ ఎం.కొండలరావు తెలిపారు. మండలం మొత్తంలో రూ.2,97,24,000 విడుదల కాగా రూ.2,49,73,000 పంపిణీ చేశారు. వడ్లమూరులో 470కి 404 మందికి పంపిణీ చేయగా 94 శాతం, అద్దంకివారిలంకలో 349కి 323 మందికి పంపిణీ చేయగా 93 శాతం, కేదారిలంకలో 481కి 446 మందికి ఇవ్వగా 93 శాతం, పడమర ఖండ్రికలో 498కి 396 మందికి పంపిణీ చేయగా 81 శాతం పూర్తయిందన్నారు. వాకతిప్పలో 412కి 366 మందికి అందజేయగా 89 శాతం, వల్లూరులో 595కి 483 మందికి పంపిణీ చేయగా 89 శాతం, కపిలేశ్వరపురం–2 సచివాలయంలో 505 మందికి 445 మందికి అందజేయడంతో 89 శాతం పంపిణీ నమోదైందన్నారు. కోరుమిల్లి–1లో 519కి 448 మందికి ఇవ్వగా 87 శాతం, కపిలేశ్వరపురం– 2 సచివాలయం పరిధిలో 554 కి 476 మందికి అందజేసి 86 శాతం, తాతపూడిలో 339 కి 291 మందికి పంపిణీ చేయగా 86 శాతం, టేకి–2లో 468 కి 396 ఇవ్వగా 85 శాతం, నల్లూరులో 418కి 353 మందికి పంపిణీ చేయగా 85 శాతం పూర్తయిందన్నారు. టేకి–1లో 494కి 409 మందికి పంపిణీ చేయగా 83 శాతం, అంగర–1 సచివాలయంలో 621 కి 513 మందికి పంపిణీ చేయగా 83 శాతం, వెదురుమూడిలో 303 కి 250 మందికి అందజేసి 83 శాతం, అంగర–2లో 713కి 565 పంపిణీ చేసి 79 శాతం, మాచరలో 586కి 456 ఇవ్వగా 78 శాతం, కాలేరులో 623కి 484 పంపిణీ చేయగా 77శాతం, నేలటూరులో 618కి 462 మందికి పంపిణీ చేయగా 75 శాతం, కోరుమిల్లి 02లో 287కి 196 మందికి ఇవ్వగా 69 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ కొండలరావు తెలిపారు.



కోరుమిల్లి–2 సచివాలయ పరిధిలో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న ఉద్యోగి

జగనన్న పథకాలు దేశానికే ఆదర్శం



వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలతో సూర్యప్రకాశ్

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్

కాజులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. గురువారం రాత్రి తిప్పరాజుపాలెంలో కార్యకర్తల(ఉప్పర్లు) సామాజికవర్గ నాయకులు జక్కే పెద్దలు, దండు సుబ్బారావు, శ్రీను, జక్కే పెద్దఅప్పన్న, దండు వెంకన్న తదితర నాయకుల ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సుమారు 400 మంది టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి చేరారు. వారికి సూర్యప్రకాశ్ పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో సీఎం జగనన్న పాలన సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుందన్నారు. అనంతరం పార్టీలో చేరిన కార్యకర్తలు మాట్లాడుతూ సీఎం జగనన్న పాలనతో రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని, రానున్న ఎన్నికలలో పార్టీ మరోసారి విజయం సాధించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాయుడు లీలాశంకర్, మాజీ సర్పంచ్ యార్ల శ్రీనివాస్, ఆర్ఎంసీ డైరెక్టర్ నల్లమిల్లి ఈశ్వర్రెడ్డి, గొల్లపాలెం, తణుకువాడ పీఏసీఎస్ చైర్మన్లు సత్తి శ్రీరామరెడ్డి, పితాని సుబ్రహ్మణ్యం, మాదిరెడ్డి వృక్ష, వుగరాల శివ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి



గొల్లపాలెంలో పార్టీ నాయకులతో తోట త్రిమూర్తులు, పిల్లి సూర్యప్రకాశ్

కాజులూరు: రామచంద్రపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయానికి కార్యకర్తలు సమష్టి కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గురువారం గొల్లపాలెంలో జరిగిన పార్టీ మహిళా విభాగ నేత, బందనపూడి సర్పంచ్ దేగల తిరుమలవేణి నూతన గృహప్రవేశ వేడుకల్లో వారు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో వారు కార్యకర్తలతో మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటున్న ముఖ్యమంత్రి జగనన్న ఆశయాలను కృషి చేస్తున్నారని చెప్పారు. నవరత్న పథకాలతో ప్రజలకు మేలు చేస్తున్న జగనన్నకు మరో 50 కోట్ల ఓట్లు... మరో సారి తమ పాలనను చేర్పాలన్నారు. జగనన్న సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష అని అన్నారు. ఎంపీపీ మాత భారతి, పార్టీ నాయకులు దేగల బుజ్జి, దేగల నాగేంద్ర, వంగా రంగా, యార్ల బాబు, పలువురు సర్పంచ్లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివార్ల కల్యాణ మహోత్సవాలు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ క్షేత్రంలో ఉన్న పర్వతవర్ధిని సమేత సప్తకోటి రామలింగేశ్వర స్వామి, బాలాత్రిపుర సుందరి సమేత వరుణేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వియ్యంపేటలో రామేశ్వర తీర్థంలో స్వయంగా శ్రీరాముడు ప్రతిష్ఠించినట్లుగా తెలియజేస్తున్న పర్వతవర్ధిని సమేత సప్తకోటి రామలింగేశ్వరస్వామి కల్యాణ క్రతువును దేవులపల్లి శ్రీరామ్, మద్దిరాల రాజేష్ బ్రహ్మత్వంలో దివిష్, సంగీత దంపతులు ఆధ్వర్యంలో శ్రీనివాస్, హేమవేణి దంపతుల చేతుల మీదుగా నిర్వహించి, అన్న ప్రసాద వితరణ చేశారు. అదే విధంగా బాలాత్రిపుర సుందరి సమేత వరుణేశ్వర స్వామి కల్యాణం దేవుని ఫణిరామకృష్ణ, కొంతేటి భీమశంకరం, మద్దిరాల రఘునందన్ బ్రహ్మత్వంలో కన్నుల పండువగా నిర్వహించారు.

జగనన్నకు తోడుగా నాయీ బ్రాహ్మణులు సిద్ధం

రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సిద్ధవటం యానాదయ్య



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఇతర నాయకులు

మండపేట: రాష్ట్రంలో నాయీ బ్రాహ్మణులను గుర్తించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డికే దక్కుతుందని ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు సిద్ధవటం యానాదయ్య పేర్కొన్నారు. గురువారం మండపేట వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులను ఆయన కలిశారు. ఈ సందర్భంగా జగనన్నకు తోడుగా మేమంతా సిద్ధం కరపత్రాని ఎమ్మెల్సీ తోట చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం యానాదయ్య మీడియాతో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన 76 సంవత్సరాలు తర్వాత దేశంలో ఎక్కడా లేని విధంగా నాయీ బ్రాహ్మణులకు ఆర్థిక సామాజిక గౌరవాన్ని కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి కల్పించారన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు అనేక పర్యాయాలు నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేయి చూపారన్నారు. ఇప్పుడు ఎన్నికలు ముందు దొంగ హామీలతో వక్రబుద్ధితో ఎన్నికలకు వస్తున్నారని, ఆయనకు బుద్ధి చెప్పాలని యానాదయ్య కోరారు. వైఎస్ జగన్ 2019లో జీవో నంబర్ 59 ప్రకారం నాయీ బ్రాహ్మణులకు షాపులు ఉన్న ప్రతి ఒక్కరికి రూ.10 వేలు చొప్పున ఇప్పటి వరకు నాలుగు విడతలుగా 50 వేల చొప్పున ఒక్కొక్కరికి రూ.40 వేల చొప్పున 200 కోట్లు అందజేశారన్నారు. జీవో నెంబర్ 15 ద్వారా నాయీ బ్రాహ్మణులు స్థాపించిన సెలూన్ షాపులకు 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ను ఇస్తానని ఎన్నికలకు ముందు వాగ్దానం చేసిన నారా చంద్రబాబు నాయుడు ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ జీవోను అమలుపరిచారన్నారు. గత 77 సంవత్సరాల భారత స్వాతంత్ర్య చరిత్రలో మొదటిసారిగా సేవకులను పాలకులుగా చేసిన ఘనత ఈ పార్టీకే దక్కిందన్నారు. చిత్తూరు డీసీసీబీ చైర్మన్, మార్కెట్ యార్డ్ చైర్మన్, కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీటీసీలుగా వందలాది మందికి నామినేటెడ్ పదవులు కల్పించారన్నారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కావలర్లు శ్రీదేవి, నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు మల్లవలస గణపతి, గన్నేడ సురేష్, ఎంపీపీ వైస్ చైర్మన్ నక్కా సింహాచలం, ఎంపీపీ వైస్ చైర్మన్ చిట్టాల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పలివెల సుధాకర్, కపిలేశ్వరపురం ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఏడిద సర్పంచ్ వరదా చక్రవర్తి, సాయి తదితరులు పాల్గొన్నారు.

పేదల వ్యతిరేకి చంద్రబాబు

కపిలేశ్వరపురం: శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర స్థానంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా టిప్పర్ డ్రైవర్ ఎస్ఎల్ ఈరలక్కప్పకు సీటు ఇవ్వడాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు వెటకరించడాన్ని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మల్లిపూడి శివకుమార్ ఖండించారు. అలా చేయడంలో చంద్రబాబులోని పెత్తందారీతనం బయటపడిందన్నారు. పేదలను గుర్తించి ప్రజాస్వామ్య పాలనలో భాగస్వాములను చేయడంలో దేశంలోనే సీఎం జగన్మోహన్రెడ్డికి ప్రత్యేకత ఉందన్నారు. ప్రజల మధ్యలో ప్రజా సమస్యలపై స్పందించే గుణం కలిగిన వ్యక్తులనే అభ్యర్థులుగా సీఎం జగన్ నిలపడం గర్వంగా ఉందని శివకుమార్ అన్నారు.

తెలుగు సాహిత్యంలో ఉపాధ్యాయుడికి అవార్డు



సాహితీ ప్రముఖుల చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న స్వామిప్రసాద్

మండపేట: పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు గండి స్వామి ప్రసాద్కు తెలుగు సాహిత్యంలో చేస్తున్న కృషికి అవార్డు లభించింది. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం స్వాతంత్ర్య సమరయోధులు శతాధిక గ్రంథకర్త ఆయిన పడాల రామారావు స్మారక పురస్కారాన్ని గురువారం రాజమహేంద్రవరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో స్వామి ప్రసాద్ అందజేశారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆరసం రాష్ట్ర కార్యదర్శి బొల్లినేని నాగార్జున సాగర్, స్వామి ప్రసాద్కు అవార్డు అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆరసం గౌరవ అధ్యక్షుడు, ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు కర్రి రామారెడ్డి, అధ్యక్షుడు పడాల వీరభద్రరావు, కార్యదర్శి బీవీ రమాదేవి, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి ఆధ్వర్యంలో స్వామి ప్రసాద్ ఈ అవార్డును స్వీకరించారు. డాక్టర్ సత్యనారాయణ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ చల్లా రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి కేవీ సత్యనారాయణ, సాహితీ ప్రియులు నాగ సత్యనారాయణ, గైట్ కళాశాల వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నాగుసత్యనారాయణ, గైట్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మీరా, తెలుగు పండితులు శ్రీనివాస్, డాక్టర్ మద్దుకూరి సత్యనారాయణ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సవితాల సుబ్రహ్మణ్యం తదితరులు ఆయనను అభినందించారు.

అప్రజాస్వామిక వాదులను ఓడించండి

సీపీఐ, ప్రజానాట్య మండలి నేతలు నల్లబాబు, స్టాలిన్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ స్టాలిన్

రామచంద్రపురం: సమాజ మార్పు కోసం, ప్రజా చైతన్యం కోసం నిరంతరం ప్రజా సాంస్కృతిక ఉద్యమాన్ని నడిపించాలని, సార్వత్రిక ఎన్నికల్లో మతోన్మాద, అప్రజాస్వామిక వాదులను ఓటుతో ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నల్లబాబు, ఏపీ ప్రజానాట్య మండలి సీనియర్ నాయకుడు డాక్టర్ స్టాలిన్ పిలుపునిచ్చారు. పట్టణంలో డాక్టర్ చెలికాని రామారావు భవన్లో గురువారం ప్రజానాట్య మండలి నిర్వహిస్తున్న ఎన్నికల పాటల వర్క్ షాప్ మూడో రోజు ముగింపు సభ జరిగింది. ఈ సభకు నల్లబాబు, డాక్టర్ స్టాలిన్ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా నల్లబాబు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక నియంతృత్వ ధోరణి పెరిగి, రాజకీయ వ్యవస్థ చిన్నాభిన్నమైందన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా పాలన కొనసాగడం దేశానికి మంచిది కాదన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యం కోసం, లౌకికవాదం తో ఏర్పడిన ఇండియా కూటమి గెలుపు కోసం ఏపీ ప్రజానాట్యమండలి తన పాటలతో ప్రజల్ని చైతన్యపరచాలన్నారు. డాక్టర్ స్టాలిన్ మాట్లాడుతూ సాంస్కృతిక ఉద్యమం నిరంతరం కొనసాగాలని, కళాకారులు పాటలు, కళారూపాలతో ప్రజలను చైతన్యపరచడమే కాకుండా, ప్రజలకు మనోధైర్యాన్ని అందిస్తున్నారని చెప్పారు. మండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిన్నెం పెంచలయ్య మాట్లాడుతూ శిక్షణ తరగతులలో పాల్గొన్న కళాకారులు వారి జిల్లాలలో ప్రత్యేకంగా జిల్లా స్థాయి శిక్షణ తరగతులను నిర్వహించాలన్నారు. ఎన్నికల ప్రచారంలో అగ్రభాగాన నిలవాలని కోరారు. జాతీయ కార్యదర్శి గని, రచయిత దేవరకొండ శ్రీనివాస్ ను ఘనంగా సన్మానించారు.

సంతాన గణపతిని దర్శించి.. ప్రచారాన్ని ప్రారంభించి..



ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

మండపేట: సంతాన గణపతి, వీరభద్ర స్వామి వార్ల ఆశీస్సులతో వైఎస్సార్సీపీ మండపేట నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఘన విజయం సాధించాలని ఆ పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, రైస్మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి ఆకాంక్షించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని మండపేట వైఎస్సార్ సీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులకు మద్దతుగా ఆ పార్టీ శ్రేణులు గురువారం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మున్సిపల్ పరిధిలోని 15వ వార్డు సంతాన గణపతి ఆలయం నుంచి తొలిరోజు ఎన్నికల ప్రచారాన్ని ఆరంభించారు. పార్టీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో పట్టాభి, రాజబాబుతో పాటు మున్సిపల్ వైస్చైర్మన్ పతివాడ నూకదుర్గారాణి, యువనేతలు తోట పృథ్వీరాజ్, చోడే సత్యకృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత దర్గుండం చెరువుగట్టుపై సంతాన గణపతి ఆలయంలో ప్రసిద్ధికెక్కిన ఆలయంలో కొలువుతీరిన విఘ్నేశ్వరుడిని, వీరభద్ర స్వామి వార్లను స్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆ వార్డు కౌన్సిలర్ గ్రంధి శ్రీనివాస్ తన పరిధిలో వున్న వీధులన్నీ తిరిగారు. దర్శనంతరం నాలుగు వీధులు, వృద్ధాశ్రమం వెనక వున్న కాలనీ ప్రజలను కలుసుకుని ఓట్లను అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి తోట త్రిమూర్తులను ఎంఎల్ఏ అభ్యర్థి రాపాక వరప్రసాద్ ను అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మేకా శ్రీనివాస్, కొవ్వూరు శెట్టి కళ్యాణి, మలసాని సీతామహలక్ష్మి, బొక్కా సరస్వతి, సీలం దుర్గమ్మ, ఎర్నేని ప్రభావతి, మేండు బాపిరాజు, చిట్టాల సతీష్, మండపేట రవికుమార్, సవరప సతీష్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు శ్రీనివాస్, షేక్ అలీఖాన్ బాబా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పద్మావతి, సొసైటీ ప్రెసిడెంట్ గంగాధర్, కార్యకర్తలు పాల్గొన్నారు.